# ప్రజా మారుపు
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు




బేగంపేటలో భారీ చోరీ.. 81 తులాల బంగారం, నగదు అపహరణ


ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 26 | మంగళవారం | 22 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2


### ప్రతి నియోజకవర్గంలో
# లక్ష ఇళ్లు నిర్మిస్తాం

- తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రాయదుర్గంలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన
- ఇప్పటికే నిర్మాణం ప్రారంభిస్తే నిధుల మంజూరుకు ఆదేశం
- ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామన్న మంత్రి పొంగులేటి
- గత ప్రభుత్వం పేదలను నిర్లక్ష్యం చేసిందని విమర్శ
- ఎల్3 కేటగిరీ లబ్ధిదారుల విషయంలో స్పష్టతనిచ్చిన ప్రభుత్వం



**హైదరాబాద్ :**
ఎల్3 కేటగిరీ ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్షేత్ర స్థాయి సర్వేలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల విచారణలో అనర్హులుగా తేలిన వారిని అధికారులు ఎల్3 కేటగిరిలో పెట్టారు. కానీ ఒకవేళ వారు ఎల్3లో ఉన్నప్పటికీ ఇల్లు నిర్మాణం ప్రారంభిస్తే ప్రత్యేక అనుమతి ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. బేస్‌మెంట్ పూర్తయి ఎల్3లో ఉంటే ఆ ఇళ్లకు ఈ పథకం కింద నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఇళ్లు మంజూరై నిర్మాణం ప్రారంభం కాని అనర్హులకు రద్దు చేస్తామని ఆయన చెప్పారు. ఎల్3 కేటగిరీలో అనర్హులకు రద్దు చేసి అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. క్యూర్(హైదరాబాద్) పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇల్లు వచ్చేవరకు ఈ పథకం - మిగతా 2 లో



## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే

- రంగంలోకి రెవెన్యూ అధికారులు
- ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే
- సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి
- మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన
- శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన

**హైదరాబాద్ :**
సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో - మిగతా 2 లో

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు
# హైకోర్టు నోటీసులు



- అసెంబ్లీ స్పీకర్ ను దూషించిన కేసు
- అరెస్టు చేయవద్దంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాల్ చేసిన పోలీసులు
- కౌంటర్ దాఖలు చేయాలంటూ మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు


**హైదరాబాద్ :**
తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను అసభ్య పదజాలంతో - మిగతా 2 లో

# రామ మందిరంలో భారీ కుంభకోణం!

- 105 సార్లు విరాళాల చోరీ
- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిర్ధారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది అరెస్ట్
- సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలుకు ఏర్పాట్లు


2 లో

### సోనియా గాంధీ పౌరసత్వం కేసులో
# దర్యాప్తునకు ఆదేశాలు



- పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే ఎన్నికల జాబితాలో సోనియా పేరు ఉందని ఆరోపణలు
- దీనిపై దర్యాప్తును తిరస్కరిస్తూ గతంలో మేజిస్ట్రియల్ కోర్టు ఆదేశాలు
- తాజాగా కొట్టివేస్తూ ఆదేశాలు

**ఢిల్లీ :**
కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు షాక్ ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందేందుకు మూడేళ్ల ముందే సోనియా గాంధీ పేరును ఓటర్ల జాబితాలో చేర్చారన్న ఆరోపణపై విచారణకు నిరాకరిస్తూ గతంలో మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ దాఖలైన రివిజన్ పిటిషన్‌ను అనుమతించింది. ఈ పిటిషన్‌ను తిరిగి విచారణ చేపట్టాలంటూ ఢిల్లీ కోర్టు సోమవారం ఆదేశించింది. మేజిస్ట్రేట్ ఉత్తర్వును సరైన వివరణ లేనిదిగా పేర్కొంటూ ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దానిని కొట్టివేశారు. రౌస్ అవెన్యూ కోర్టుల సెంట్రల్ ఢిల్లీ కోర్ట్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు - మిగతా 2 లో

### 'సర్' ప్రక్రియ పేరుతో
# వికృత చేష్టలు


2 లో

- సీపీఐ సీనియర్ నేత నారాయణ
- సర్ పేరుతో వికృత చేష్టలకు పాల్పడుతున్నారన్న నారాయణ
- అద్వానీ, జైశంకర్ వంటి ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేశారని విమర్శ
- వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడాన్ని కూడా పెద్ద సమస్యగా చూపుతున్నారని మండిపాటు



### ఏపీలో ముందే దసరా
# సెలవుల సందడి

- ఆ రెండ్రోజులు భలే కలిసొచ్చాయి!
- ఏపీలో విద్యార్థులకు కలిసొచ్చిన దసరా సెలవులు
- అక్టోబరు 12 నుంచి 21 వరకు సెలవులు
- అక్టోబర్ 10 రెండో శనివారం, 11వ తేదీ ఆదివారం
- దాంతో ముందే ప్రారంభం కానున్న సెలవుల సందడి

**అమరావతి :**
ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాల విద్యార్థులకు ఈ ఏడాది దసరా సెలవులు కాస్త ముందుగానే రానున్నాయి. - మిగతా 2 లో

### యుద్ధ మేఘాల నీడలో
# ఐరాస భేటీ


2 లో

- మోదీ, జిన్‌పింగ్, పుతిన్ గైర్హాజరు
- యుద్ధాల నడుమ ఐరాస ఉన్నత స్థాయి సమావేశాలు
- ఈ భేటీకి ప్రధాని మోదీ, చైనా, రష్యా అధ్యక్షులు గైర్హాజరు
- భారత్ తరపున విదేశాంగ మంత్రి జైశంకర్ శనివారం ప్రసంగం
- ఈసారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రమాదాలపై ప్రధానంగా చర్చ
- అసలైన చర్చలు తెరవెనుక సమావేశాల్లోనే జరుగుతాయని వెల్లడి

### రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో
# 105 చెరువుల అభివృద్ధి

- మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన పవన్ కల్యాణ్
- పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కల్యాణ్ పర్యటన
- ఫక్రుద్దీన్ పాలెంలో సుందరీకరించిన చెరువు ప్రారంభం
- పిఠాపురంలో రూ. 6 కోట్లతో 11 చెరువుల ఆధునీకరణ
- గ్రామాల్లో చెరువులను ఆహ్లాద, ఆరోగ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళిక



**అమరావతి :**
ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ సోమవారం సొంత నియోజకవర్గంలో పర్యటించారు. ఫక్రుద్దీన్ పాలెం గ్రామంలోని - మిగతా 2 లో

### ఉపాధ్యాయులపై
# దాడులు సహించం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- రౌడీయిజం చేస్తే తోక కత్తిరిస్తాం
- విజయవాడలో స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడిని ఏపీ సీఎం చంద్రబాబు ఖండించారు
- ఎన్నో డీఎస్సీలు, ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇచ్చామని గుర్తుచేశారు
- స్వర్ణ కుప్పం' బహిరంగ సభలో పాల్గొన్న సీఎం చంద్రబాబు



**అమరావతి :**
సీబీఎన్ హయాంలో మెగా డీఎస్సీలో అవినీతి అవకాశమే ఉండదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్నో డీఎస్సీలు, ఏపీపీఎస్సీ ద్వారా ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఎక్కడా పేపర్ లీక్, మ్యానిపులేషన్ గానీ జరగలేదని తెలిపారు. సొంత నియోజకవర్గ కుప్పం పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం కుప్పంలో నిర్వహించిన 'స్వర్ణ కుప్పం' బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విజయవాడలో స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైఎస్సార్సీపీ నేతల దాడిని సీఎం చంద్రబాబు ఖండించారు. ఫేక్ పార్టీ అందరినీ ఫేక్ అంటే సహించేది లేదన్నారు. " విజయవాడలో గురువులపై రౌడీలు దాడి చేస్తున్నారు. టీచర్లపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం. కఠిన చర్యలు తీసకుంటాం. సాక్షి రిపోర్టర్, టీచర్‌పై దాడి చేశారంటే ఎంత బరితెగించిందో అర్థం చేసుకోండి. అసెంబ్లీకి వచ్చి చర్చిస్తే సాక్ష్యాధారాలతో నోళ్లు మూయిస్తాం. చట్టబద్ధ ప్రక్రియపై కోర్టుకు వెళ్లొచ్చు, కానీ దాడులేంటి ఉపాధ్యాయులపై రౌడీలను ఎగదోయడమేంటి గత పాలనలో పాలకులే రౌడీయిజం చేశారు, దారుణాలకు పాల్పడ్డారు. కుప్పం - మిగతా 2 లో

ప్రజా మాటల
మంగళవారం 22 - 09 - 2026

# సంపాదకీయం

## మౌనంగానే ఉండమని అంటోంది మన రాజ్యాంగం!

2026లో పార్లమెంట్ ఆమోదించిన సవరణ చట్టం 1971 నాటి 'జాతీయ గౌరవాలకు అవమాన నిరోధక చట్టం'లోని సెక్షన్ 3ను మార్చింది. ఇంతవరకు ఈ సెక్షన్ జాతీయగీతం (జనగణమన) ఆలాపనకు అడ్డుపడటాన్ని మాత్రమే నేరంగా చూసేది. ఇప్పుడు అదే రక్షణను జాతీయ గేయం (వందేమాతరం)కు కూడా వర్తింపజేస్తున్నది. ఈ చట్టం ప్రకారం 'వందేమాతరం' పాడుతున్నప్పుడు అడ్డుపడినా, అవమానించినా దానిని నేరంగా పరిగణిస్తారు. అయితే గేయాన్ని పాడకుండా ఎవరైనా మౌనంగా ఉంటే, అది కూడా నేరమేనా? ఈ ప్రశ్నకు సమాధానం వెతకాలంటే ముందు మరో ప్రాథమిక ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలి. మౌనం అంటే ఏమీ చెప్పకపోవడమేనా, లేక అది కూడా ఒక రకమైన వ్యక్తీకరణేనా? మన రాజ్యాంగం దీనికి స్పష్టమైన సమాధానమే ఇస్తున్నది.రాజ్యాంగంలోని 19వ అధికరణ ప్రతి పౌరుడికీ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఇస్తున్నది. సాధారణంగా మనం దీన్ని 'మాట్లాడే హక్కు'గా అర్థం చేసుకుంటాం. కానీ కోర్టులు దీన్ని మరింత లోతుగా చూస్తున్నాయి. ఒక విషయాన్ని చెప్పే హక్కు ఎంత ముఖ్యమో, చెప్పకుండా ఉండే హక్కు కూడా అంతే ముఖ్యమని నొక్కి చెబుతున్నాయి. ఎవరైనా ఒక విషయాన్ని అంగీకరించినా, అంగీకరించకపోయినా, మౌనం ద్వారానే తన అభిప్రాయాన్ని తెలియజేయవచ్చు. ఆ హక్కును కూడా రాజ్యాంగం కాపాడుతుంది.భారత అత్యున్నత న్యాయస్థానం దీన్ని పలు సందర్భాలలో నిరూపించింది. 1986లో బిజోయ్ ఇమాన్యుయేల్ వర్సెస్ కేరళ రాష్ట్రం అనే కేసు మంచి ఉదాహరణ. కేరళలో క్రైస్తవ మత విశ్వాసం కలిగిన ఇద్దరు పిల్లలు జాతీయగీతం పాడేటప్పుడు గౌరవంగా నిలబడేవారు. అయితే జాతీయగీతాన్ని ఆలపించడం లేదని పాఠశాల వారిని బహిష్కరించింది. ఈ కేసులో సుప్రీంకోర్టు గౌరవంగా నిలబడటమే సరిపోతుంది, పాడాలని బలవంతం చేయలేమని, పిల్లలను తిరిగి పాఠశాలలో చేర్చుకోవాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పుకు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛతో పాటు, మతస్వేచ్ఛనిచ్చే 25వ అధికరణ కూడా మద్దతునిచ్చింది. 1978లో నందిని సత్పతి వర్సెస్ పి.ఎల్.దానీ కేసులో, పోలీసుల విచారణలో కూడా మౌనంగా ఉండే హక్కును కోర్టు సమర్థించింది. వేర్వేరు సందర్భాలే అయినా, వీటన్నింటి వెనుక ఉన్న సూత్రం ఒక్కటే. మాట్లాడాలా వద్దా అనేది వ్యక్తి నిర్ణయం. శాసన అధికారం ద్వారా ఒక వ్యక్తి తనకు ఇష్టం లేని విషయాన్ని మాట్లాడాలని బలవంతం చేయడం కుదరదు. ఇదే సూత్రాన్ని ఇతర దేశాలు కూడా అనుసరించాయి. అమెరికాలో 1943లోనే వెస్ట్ వర్జీనియా వర్సెస్ బార్నెట్ కేసులో విద్యార్థులను జెండాకు వందనం చేయాలని బలవంతం చేయలేమని కోర్టు తీర్పు ఇచ్చింది. దేశమేదైనా పౌరుడి నోటిలో బలవంతంగా మాటలు కుక్కడం ప్రజాస్వామ్య విరుద్ధమే.మరి జాతీయగీతాన్ని గౌరవించాలని కూడా రాజ్యాంగమే చెబుతున్నది కదా? అవును, చెప్పింది. 51ఎ అధికరణ ప్రకారం, జాతీయగీతానికి గౌరవం చూపడం ప్రతి పౌరుడి బాధ్యత. కానీ ఇక్కడ ఒక సూక్ష్మమైన తేడా ఉంది. గేయాన్ని పాడడం మాత్రమే గౌరవం కాదు. గేయంపై గౌరవంతో నిలబడటం, భంగపరచకుండా ఉండటం కూడా గౌరవించడమే. ఉదాహరణకు రాజకీయ సభలు జరుగుతున్న సందర్భంలో మసీదులో కల్మాను చదువుతున్నప్పుడు నాయకులు తమ ప్రసంగాన్ని ఆపి, తర్వాత కొనసాగిస్తారు. నిస్సందేహంగా ఇది గౌరవాన్ని ప్రకటించడమే. వారు కూడా కల్మాను చదివితేనే గౌరవం ప్రకటించినట్లు కాదు కదా? మౌనంగా నిలబడడం కూడా ఒక విధమైన గౌరవ వ్యక్తీకరణలో భాగమే. బాధ్యత, హక్కు ఈ రెండూ కలిసే ఉంటాయి.ఇప్పుడు 2026లో వచ్చిన కొత్త చట్టాన్ని ఇదే కోణం నుంచి చూద్దాం. ఈ చట్టం వందేమాతరం ఆలాపనకు అడ్డుపడటాన్ని, పాడుతున్నవారిని భంగపరచటాన్ని నేరంగా పరిగణిస్తుంది. ఈ నేరానికి మూడేళ్ల వరకు జైలు శిక్ష ఉంది. అంతేగానీ గేయాన్ని పాడుతున్నప్పుడు మౌనంగా నిలబడి గౌరవాన్ని ప్రకటిస్తున్నవారు నేరస్థులు అని ఈ చట్టం చెప్పడం లేదు. పైన చెప్పిన రాజ్యాంగ సూత్రం ప్రకారం చూస్తే, ఈ మౌనం రాజ్యాంగం కాపాడే వ్యక్తీకరణ స్వేచ్ఛలో భాగమే.అయితే, ఇది రాతలో ఎంత స్పష్టంగా ఉన్నా ఆచరణలో మాత్రం అంత సులభంగా కొనసాగదు. మూడేళ్ల జైలు శిక్ష అనే మాట వినగానే పాఠశాలలు, సంస్థలు భయపడతాయి. రిస్క్ వద్దని అందరినీ పాడమని ఒత్తిడి చేసే అవకాశం ఉంది. ఇదే అసలు సమస్య. చట్టం సరిగ్గానే ఉన్నప్పటికీ, దాన్ని అమలు చేసే చేతుల్లో రాజ్యాంగ సూత్రంపై అవగాహన లేకపోతే, హక్కు ఆచరణలో కనుమరుగవుతుంది.కాబట్టి వందేమాతరం వివాదంలో అసలు ప్రశ్న గేయం ఎన్ని చరణాలు పాడాలి అన్నది కాదు. మౌనాన్ని కూడా ఒక చెల్లుబాటు అయ్యే వ్యక్తీకరణగా గుర్తించగలమా? అన్నదే అసలు ప్రశ్న. ఈ గుర్తింపు ఉంటేనే గేయానికి గౌరవం, పౌరుని వ్యక్తిగత స్వేచ్ఛ రెండూ కలిసి నిలబడతాయి. ఒకటి లేకపోతే మరొకటి అసంపూర్ణమే. ఇక్కడ ఒక విషయం స్పష్టం చేయాలి. ఈ విధంగా మౌనంగా ఉండే హక్కు వందేమాతరం విషయంలో సరిగ్గా ఇలాగే వర్తిస్తుందని ఇంతవరకు ఏ కోర్టూ నేరుగా తేల్చలేదు. ఇది గతంలో జాతీయగీతంపై వచ్చిన తీర్పుల ఆధారంగా చేసిన హేతుబద్ధమైన అంచనా మాత్రమే.అన్ని వర్గాల వారు ఇతరుల విశ్వాసాలను కూడా గౌరవిస్తూ చేయి చేయి కలిపి ముందుకు సాగినప్పుడే నిజమైన స్వేచ్ఛ అనుభవయోగ్యం అవుతుంది. కాబట్టి పాడుతున్న వారికి అభ్యంతరం చెప్పకుండా, పాడని వారిని బలవంతం చేయకుండా ఉండగలిగే సంస్కారమే ఈ దేశానికి నిజమైన రక్షణ కవచం.

## రామ మందిరంలో భారీ కుంభకోణం



**మొదటిపేజీ తరువాయి -** అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టుకు సిట్ తన నివేదికను సమర్పించింది.సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసుకు సంబంధించిన సిట్ నివేదికలోని కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా విరాళాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసి, ఆ నగదును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరుస్తారు. అయితే, ఈ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం దర్యాప్తు తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని మెహతా కోర్టుకు వివరించారు.ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ ఉన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో రామ్ మందిర్ ట్రస్టులో కీలక మార్పులు చేశారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు తప్పుకున్న అనంతరం, ఆలయ పరిపాలన కోసం సీఈఓ నేతృత్వంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నూతన సీఈఓగా నియమించారు. కాగా, సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

## కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే

**మొదటిపేజీ తరువాయి -** మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమవారం ఉదయం తిరిగి ప్రారంభమైంది.సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూములు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు.అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు.సర్వే నంబర్ 325 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతులకు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు.ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయులపై దాడులు సహించం

**మొదటిపేజీ తరువాయి -** వస్తే నన్ను కూడా ఇబ్బంది పెట్టారు. దౌర్జన్యాలకు దిగారు. రౌడీయిజం చేసేవారి తోక కత్తిరిస్తాం. రౌడీలు, విధ్వంసకారులను తరిమికొట్టే సత్తా కుప్పానికి ఉంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు."డీఎస్సీకి చిరునామా సీబీఎన్, తెలుగుదేశం. 14సార్లు డీఎస్సీ నిర్వహించాం. 2024 తర్వాత మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలిచ్చాం. ఉద్యోగాలను అడ్డుకోవడానికి 350 పిటిషన్లు వేశారు. ఆరోపణలకు వాస్తవాలు వివరించాం, అన్నింటికీ సమాధానం చెప్పాం. కుక్క తోక వంకర అన్నట్లు వ్యవహరిస్తున్నారు. సీబీఎన్ హయాంలో మెగా డీఎస్సీలో అవినీతి అవకాశమే ఉండదు" – నారా చంద్రబాబు, ముఖ్యమంత్రికుప్పం నియోజకవర్గ ప్రజలతో తనది కుటుంబ అనుబంధమని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి ఇంట్లో తనను కుటుంబసభ్యుడిలా చూస్తారని చెప్పారు. "నారావారిపల్లె జన్మనిస్తే, కుప్పం రాజకీయ జన్మనిచ్చింది. నా మనసుకు దగ్గరగా కుప్పం ప్రజలే ఉంటారు. కుప్పం ప్రజలు 40 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఎన్నుకుంటున్నారు. ఏ పని చేయాలన్నా కుప్పంలోనే ప్రారంభిస్తాను. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో వసతులు, ప్రతి కుటుంబానికి ఇల్లు 'స్వర్ణ కుప్పం' లక్ష్యం.అభివృద్ధితోనే మోడల్ నియోజకవర్గంగా మారుతుంది. రాయలసీమను ఎడారి కావనివ్వొద్దని నీటి ప్రాజెక్టులకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. శ్రీశైలం నుంచి కుప్పానికి 660 కి.మీ దూరానికి నీళ్లు తీసుకొచ్చాం. ఆచరణ సాధ్యం కాదనుకున్నవారు ఆశ్చర్యపోయేలా చేశాం. హెరిటేజ్ గ్రానైట్ స్టోన్ క్లస్టర్ ఏర్పాటుతో టూరిజాన్ని ఆకర్షిస్తాం. రూ.2.5 కోట్ల వ్యయంతో మార్కెట్‌యార్డును అభివృద్ధి చేస్తాం" అని సీఎం వివరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల అభివృద్ధి

**మొదటిపేజీ తరువాయి -** మైసమ్మ చెరువు గట్టుపై వెలసిన మైసమ్మ అమ్మవారిని దర్శించుకుని, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, గ్రామీణ చెరువులకు సరికొత్త రూపునిచ్చే బృహత్తర కార్యక్రమంలో భాగంగా రూ. 73 లక్షల వ్యయంతో సుందరీకరించిన మైసమ్మ చెరువును ప్రజలకు అంకితం చేశారు.గ్రామాల్లోని చెరువులను కేవలం నీటి వనరులుగా కాకుండా, ప్రజలందరికీ ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచే సామాజిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ తెలిపారు. ఫక్రుద్దీన్ పాలెంలోని మైసమ్మ చెరువును రాష్ట్రానికే ఒక మోడల్‌గా అభివృద్ధి చేసినట్లు వివరించారు. చెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ ఎయిర్ జిమ్, పిల్లల పార్కును ఆయన ప్రారంభించారు. చెరువు గట్టుపై కలియదిరుగుతూ, అక్కడి వృక్షాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెరువు మధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నందీశ్వరుడి సహిత శివుని విగ్రహాన్ని పరిశీలించారు.ఈ ప్రాజెక్టులో భాగంగా చెరువు గట్టును బలోపేతం చేసి, పచ్చదనంతో నింపారు. ప్రజలు వ్యాయామం చేసుకునేలా ఓపెన్ జిమ్‌తో పాటు, జాతీయ భావాన్ని పెంపొందించేలా జెండా స్థూపాన్ని కూడా ఏర్పాటు చేశారు. చెరువు పక్కనే చిన్నారుల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన పార్కును పిల్లలతో కలిసి ప్రారంభించిన పవన్ కల్యాణ్, వారితో సరదాగా గడిపి చాక్లెట్లు పంచారు.ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన నిధులతో రాష్ట్రవ్యాప్తంగా రూ. 50 కోట్లతో 105 చెరువుల సుందరీకరణ పనులు చేపట్టినట్లు పవన్ కల్యాణ్ వెల్లడించారు. ఒక్క పిఠాపురం నియోజకవర్గంలోనే రూ. 6 కోట్లతో 11 చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, వీటికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ జిల్లా పరిధిలో అభివృద్ధి చేసిన 14 చెరువుల ఫొటో గ్యాలరీని తిలకించారు. ఈ నెలాఖరు నాటికి రాష్ట్రంలోని అన్ని చెరువుల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.పర్యటనలో భాగంగా ఆయన గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'సర్' ప్రక్రియ పేరుతో వికృత చేష్టలు

**మొదటిపేజీ తరువాయి -** ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రక్షాళన (సర్) పేరుతో చేపడుతున్న వింత, వికృత చర్యలు ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడేలా లేవని, విజ్ఞతలేని తీరుతో ఓటర్లను తీవ్రంగా అవమానించేలా ఉన్నాయని సీపీఐ సీనియర్ నేత నారాయణ ఘాటుగా విమర్శించారు. సర్ ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న వైఖరి 'ఎద్దు ఈనిందంటే దూడను గాట్లో కట్టేయమన్నట్లుగా' ఉందని ఎద్దేవా చేశారు.ఓటర్ల వివరాల్లో ఏవైనా సాంకేతిక లోపాలు, తప్పులు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలో సరిదిద్దాలే తప్ప, దేశ మాజీ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ, ప్రస్తుత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వంటి అత్యున్నత ప్రముఖులకు కూడా నోటీసులు జారీ చేయడం ఏ రకమైన ప్రక్షాళన అని ఆయన నిలదీశారు.పేర్లలో చిన్నపాటి స్పెల్లింగ్ పొరపాట్లు, వివాహానంతరం మహిళల ఇంటిపేర్లు మారడం వంటి అత్యంత సహజమైన అంశాలను కూడా పెద్ద సమస్యలుగా చిత్రీకరించడం, తాతముత్తాతల పుట్టిన తేదీలను వెతకాలంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం విడ్డూరంగా ఉందని నారాయణ మండిపడ్డారు. దేశంలో ఉన్న కోట్లాది మంది ఓటర్ల హక్కుల పరిరక్షణ విషయంలో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, రాజ్యాంగబద్ధమైన నిష్పక్షపాతంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రధాని కార్యాలయం నడిపించే ఒక 'సురభి నాటకం'లో స్వయంప్రతిపత్తి గల ఎన్నికల కమిషన్ అపవిత్రమైన పావుగా మారకూడదని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

## ఏపీలో ముందే దసరా సెలవుల సందడి



**మొదటిపేజీ తరువాయి -** అధికారికంగా ప్రకటించిన సెలవులకు ముందు రెండో శనివారం, ఆదివారం రావడంతో విద్యార్థులకు మరో రెండు రోజులు అదనంగా కలిసొచ్చాయి. దీంతో పండగ వాతావరణం ముందుగానే మొదలుకానుంది.రాష్ట్ర విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం, 2026 సంవత్సరానికి గాను అక్టోబర్ 12 నుంచి 21వ తేదీ వరకు, మొత్తం 10 రోజుల పాటు దసరా సెలవులను అధికారికంగా ప్రకటించారు. అయితే, దీనికి ముందుగా అక్టోబర్ 10వ తేదీ రెండో శనివారం, 11వ తేదీ ఆదివారం కావడంతో ఆ రెండు రోజులు కూడా సెలవుల్లో కలిసిపోయాయి. ఫలితంగా విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచే సెలవులు ప్రారంభం కానున్నాయి. మొత్తం మీద 12 రోజుల పాటు విరామం లభించనుంది. సెలవుల అనంతరం అక్టోబర్ 22వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి.ఇక పొరుగు రాష్ట్రమైన తెలంగాణ విషయానికొస్తే, అక్కడ విద్యార్థులకు 13 రోజుల పాటు దసరా సెలవులు లభించనున్నాయి. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. తిరిగి అక్టోబర్ 23న తరగతులు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది విజయదశమి పండగ అక్టోబర్ 20వ తేదీ, మంగళవారం వచ్చింది. తెలంగాణలో అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ ఉత్సవాలు అక్టోబర్ 18న జరగనున్నాయి.

## సోనియా గాంధీ పౌరసత్వం కేసులో దర్యాప్తునకు ఆదేశాలు

**మొదటిపేజీ తరువాయి -**
అడ్వకేట్ వికాస్ త్రిపాఠి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు."భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 175(3)ను పాటించకపోవడం, ముఖ్యంగా సంబంధిత పోలీస్ అధికారి వాదనలు వినకపోవడం, సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి స్టేటస్ రిపోర్ట్ తెప్పించకపోవడం వంటి కారణాల వల్ల సదరు ఉత్తర్వులో చట్టపరంగా స్పష్టమైన లోపం ఉంది. చట్టం ప్రకారం ఉన్న రెండు మార్గాలను అంటే ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా ప్రత్యామ్నాయంగా బీఎన్ఎస్ఎస్ కింద విచారణ జరపడం వంటి అంశాలను మేజిస్ట్రేట్ పరిగణనలోకి తీసుకోనందున ఆ ఉత్తర్వులో ఎటువంటి వివరణా లేదని స్పష్టమవుతోంది." అని న్యాయమూర్తి అన్నారు.ఫిర్యాదులో గుర్తించదగిన నేరం జరిగినట్లు వెల్లడైందా లేదా అనే ప్రధాన అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే మేజిస్ట్రేట్ పౌరసత్వం అనే అంశం వైపు మళ్లారని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించడం లేదా దీచీూూ కింద ప్రొసీడింగ్స్ నిర్వహించడం అనే చట్టపరమైన ప్రత్యామ్నాయాలను మెజిస్ట్రేట్ పరిశీలించలేదని కోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే తాజా వాదనలు విన్న న్యాయస్థానం కారణాలతో కూడిన ఉత్తర్వు జారీ చేయాలని మేజిస్ట్రేట్‌కు తిరిగి పంపింది. ఈ కేసు తదుపరి విచారణ కోసం సెప్టెంబర్ 29కి వాయిదా వేశారు. ఈ తీర్పును దిల్లీ కోర్టు తాజాగా పక్కనబెట్టడంతో దర్యాప్తునకు మార్గం సుగమం అయ్యింది.కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ 1983లో భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే 1980లో ఓటర్‌గా రిజిస్టర్ చేసుకున్నారని ఆరోపిస్తూ దిల్లీ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆమె ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించారని, ఆ వ్యవహారంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. 1983లో సోనియాకు భారత పౌరసత్వం వచ్చింది. 1980 నాటి ఓటర్ జాబితా అంటూ గతంలో బీజేపీ నేత అమిత్ మాలవీయ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. గాంధీ కుటుంబ సభ్యులైన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సంజయ్ గాంధీ, మేనకా గాంధీతో పాటు సోనియా పేరును చేర్చారని అందులో పేర్కొన్నారు. అప్పటికీ ఆమె ఇంకా ఇటలీ పౌరసత్వం కలిగి ఉన్నారని చెప్పారు. అయితే దానిపై విమర్శలు రావడంతో 1982లో ఓటర్ జాబితా నుంచి ఆమె పేరు తొలగించారని, 1983లో మళ్లీ కనిపించిందని రాసుకొచ్చారు. అప్పుడు కూడా పౌరసత్వం రావడానికన్నా ముందే మళ్లీ జాబితాలోకి పేరు వచ్చి చేరిందని ఆరోపించారు. రాజీవ్‌ను వివాహమాడిన తర్వాత పౌరసత్వం రావడానికి 15 ఏళ్లు ఎందుకు పట్టిందని ఇక్కడ ప్రశ్నించడం లేదు. ముందే ఓటర్ జాబితాలో ఆమె పేరు కనిపించడం ఎన్నికల ప్రక్రియ దుర్వినియోగం కాకపోతే ఇంకేంటి" అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే దాఖలైన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది.

## యుద్ధ మేఘాల నీడలో ఐరాస భేటీ

**మొదటిపేజీ తరువాయి -** ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో తీవ్రమైన యుద్ధాలు, ఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వార్షిక ఉన్నతస్థాయి సమావేశాలు ఈ వారం ప్రారంభం కానున్నాయి. ఈ కీలక భేటీకి 140 మంది ప్రపంచ నేతలు, మరో 53 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు, ఉక్రెయిన్ యుద్ధం, గాజాలో సంక్షోభం, సూడాన్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం వంటి అంశాలు ఈ సమావేశాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి.రేపు ఈ సమావేశాలు ప్రారంభం కానుండగా, సంప్రదాయం ప్రకారం బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా తొలి ప్రసంగం చేయనున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తారు. అయితే, ఈసారి సమావేశాలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి ముగ్గురు కీలక నేతలు గైర్హాజరవుతున్నారు. భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ శనివారం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు.'విశ్వాసాన్ని పునరుద్ధరించడం, పరివర్తనను నిర్వహించడం: అందరి కోసం పనిచేసే ఐరాస' అనే థీమ్‌తో ఈ ఏడాది సమావేశాలు జరగనున్నాయి. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, ప్రపంచ ఆకలి, పేదరికం వంటి శాశ్వత సమస్యలతో పాటు ఈసారి కృత్రిమ మేధ (ఏఐ)తో ముంచుకొస్తున్న ప్రమాదాలపై కూడా ప్రధానంగా చర్చించనున్నారు. ఐరాస సర్వప్రతినిధి సభ అధ్యక్షుడిగా ఎన్నికైన బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రెహమాన్ ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు.ప్రధాన సభలో నేతల ప్రసంగాలు లాంఛనప్రాయంగా సాగినా, అసలైన చర్చలు, దౌత్యపరమైన మంతనాలు మాత్రం తెరవెనుకే జరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. గత ఏడాది ఇలాంటి సమావేశాల సందర్భంగానే అమెరికా, కొన్ని ముస్లిం దేశాల మధ్య జరిగిన చర్చల ఫలితంగా గాజా శాంతి ప్రణాళిక రూపుదిద్దుకుందని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంలో ఐరాసను విమర్శించే ట్రంప్ కూడా ఏకీభవించడం గమనార్హం.ఈ సమావేశాల్లో కొన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగం చేసిన మరుసటి రోజే, ఆ దేశ ప్రత్యర్థి అయిన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ప్రసంగించనుండటం ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు గాజాలో తమ చర్యలను సమర్థించుకోవడానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గురువారం ప్రసంగించనుండగా, పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌కు అమెరికా వీసా నిరాకరించడం వివాదాస్పదంగా మారింది.

## ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మిస్తాం

**మొదటిపేజీ తరువాయి -** విడతల వారీగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పేదలు అయితే చాలని, ఏ పార్టీ వారు అని చూడకుండా ఇల్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఎకరా రూ.260 కోట్లు పలికే రాయదుర్గం ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రద్దీ ఉండే ప్రాంతాల్లో, చాలా ఖరీదైన ప్రాంతాల్లో టవర్స్ నిర్మించి ఇళ్లు ఇస్తున్నామన్న ఆయన బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోలేదని విమర్శించారు.ఇందిరమ్మ టవర్స్ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యానికి, పైరవీలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు. లాటరీ విధానంలో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని, ఎవరి సిఫార్సులు, ఒత్తిళ్లకు లొంగకుండా అర్హత ఆధారంగా ఎంపిక జరుగుతోందని అన్నారు. తెలంగాణ హౌసింగ్ బోర్డు కూడా క్యూర్ ప్రాంతంలో లాటరీ ఎంపికలను బహిరంగంగా ప్రకటించి, అభ్యంతరాలు స్వీకరించే విధానాన్ని అమలు చేస్తోందని గుర్తుచేశారు.ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి, వచ్చే బోనాల నాటికి ఇక్కడి నుంచే లబ్ధిదారులతో బోనాలు ఎత్తించే విధంగా నిర్మాణాలను వేగవంతం చేస్తామని మంత్రి పొంగులేటి అన్నారు. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, లబ్ధిదారులు తమ ఇల్లు ఎలా కడుతున్నారో చూసుకోవచ్చని, వారానికి ఒకసారి వచ్చి నిర్మాణ పనులను పరిశీలించాలని కోరారు. నాణ్యతలో లోపం కనిపిస్తే అక్కడే ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఆ సమస్యను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు."ఇది ప్రభుత్వం ఇచ్చే ఒక గిఫ్ట్ కాదు. మీ పిల్లలకు, మీ భవిష్యత్ తరాలకు మిగిలే ఆస్తి. రాయదుర్గం వంటి ప్రాంతంలో నాకూ ఒక సొంత ఇల్లు ఉంది అని మీ పిల్లలు గర్వంగా చెప్పుకునేలా ఈ ఇంటిని కాపాడుకోండి.ఎకరా రూ.260 కోట్లు పలికే రాయదుర్గం ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మిస్తు ఒదని మంత్రి పొంగులేటి తెలిపారు. పేద ప్రజలకు అండగా ఉండే ప్రభుత్వమని, అందుకే ఎకరా రూ.260 కోట్ల విలువైన కూడా స్థలం కేటాయించినట్లు చెప్పారు. ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు లేకుండా ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. క్యూర్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్స్ నిర్మించి తీరుతామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రెండు, మూడు, నాల్గవ విడత కింద ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు."ఆ భగవంతుడి దయతో మీ కోరికల ఫలితంగా వచ్చే బోనాల పండగ నాటికి మీచేత ఇక్కడి నుంచే బోనాలు ఎత్తించే కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వ పక్షాన మేం చేపడతాం. ఇందిరమ్మ టవర్స్ కట్టేటప్పుడు వారానికి ఒక్కసారి మీరు వచ్చి చెక్ చేసుకోవచ్చు. ఏవైనా సమస్యలు ఉంటే ఇక్కడి అధికారులకు ఫిర్యాదు చేసే సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నాం.వచ్చే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం ప్రారంభవుతుందని తెలిపారు.హైదరాబాద్ రాయదుర్గంలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. రాయదుర్గం మల్కం చెరువు వెనుక 2.85 ఎకరాల స్థలంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఈ శంకుస్థాపనలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్ ఇతరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు హైకోర్టు నోటీసులు

**మొదటిపేజీ తరువాయి -** దూషించారనే ఆరోపణల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలకు ఉన్నత న్యాయస్థానం షాక్ ఇచ్చింది. నాంపల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇచ్చిన అరెస్ట్, రిమాండ్ నిరాకరణ ఉత్తర్వులను సవాలు చేస్తూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం, ఈ వ్యవహారంలో తమ సమాధానాన్ని వివరణాత్మకంగా కౌంటర్ దాఖలు చేయాలని ఇద్దరు ఎమ్మెల్సీలకు అధికారిక నోటీసులు జారీ చేసింది.విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూ టర్ నాగేశ్వరరావు కోర్టు ఎదుట వాదనలు వినిపిస్తూ, రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అత్యంత అనుచిత పదజాలంతో దూషించడమే కాకుండా విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారులపై కూడా దాడులకు తెగబడ్డారని తెలిపారు. వీరిద్దరి అరెస్టును, రిమాండ్‌ను అడ్డుకు ంటూ నాంపల్లి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. ఇరు వర్గాల ప్రాథమిక నివేదికలను పరి శీలించిన హైకోర్టు, తదుపరి స్పష్టత కోసం ఎమ్మెల్సీల కౌంటర్ దాఖలుకు ఆదేశిస్తూ తదుపరి విచారణను ఎల్లుండికి వాయిదా వేసింది.



## ఇబ్రహీంపట్నంలో తీవ్రమవుతున్న కోతుల బెడద నివారణ చర్యలు చేపట్టాలని ప్రజావాణిలో వినతిపత్రం



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 21 (ప్రజా మంటలు దగ్గుల అశోక్ )** ఇబ్రహీంపట్నంలో గత కొన్ని నెలలుగా కోతుల సంచారం తీవ్రమై, ప్రజలు భయాందోళనల మధ్య గడుపుతున్నారని, వెంటనే అధికారులు స్పందించి కోతుల బెడద నుండి రక్షణ కల్పించాలని తెలంగాణ జనసమితి (టీజెస్ ) నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రోజున ఇబ్రహీంపట్నం మండల ఎంపీడీఓ మరియు తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ... గ్రామంలో కోతులు జనావాసాల్లోకి చొరబడి ఇళ్లలోని ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులపై దాడులు చేసి గాయపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా కోళ్లు, పెంపుడు జంతువులను సైతం చంపి తింటూ భయాందోళనకర వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని తెలిపారు. ఊరిలో ప్రజలు నెమ్మదిగా జీవించలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, కోతులను పట్టుకుని అడవుల్లోకి తరలించేలా విధానపరమైన చర్యలు చేపట్టాలని, గ్రామ నివాసితులను ఈ సమస్య నుండి కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా కార్యదర్శి చింతకుంట శంకర్, మండల అధ్యక్షులు కంతి రమేష్, గ్రామ శాఖ అధ్యక్షులు ఏశాల గంగారెడ్డి, నాయకులు ఎండీ రిజ్వాన్, కె. హరీష్, ఏ. సురేష్ , కస్తూరి భూమేశ్వర్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## శిధిలావస్థలో ప్రభుత్వ క్వార్టర్లు

### ప్రజావసరాలకు వినియోగించాలి



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 21:** జగిత్యాల పట్టణంలోని శ్రీరామ థియేటర్ ఎదురుసందు నుంచి టీవీ స్టేషన్ వరకు వెళ్లే మార్గంలో శిధిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ, మున్సిపల్ క్వార్టర్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ కౌన్సిలర్ అరవ లక్ష్మి, ఎసిఎస్ రాజు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. చాలా కాలంగా వినియోగంలో లేకపోవడంతో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ డీఈ తదితర క్వార్టర్లు పూర్తిగా శిధిలావస్థకు చేరుకున్నాయని, భవనాలు ప్రమాదకరంగా మారడంతో పాటు పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని వారు తెలిపారు. రాత్రి వేళల్లో ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారే అవకాశం ఉండటంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే రైతుబజార్‌లో పెద్ద ఎత్తున కూరగాయల వ్యాపారం నిర్వహించే దళారుల బండ్లు రాత్రి వేళల్లో నివాస ప్రాంతాల గుండా రావడం వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కూరగాయల వ్యాపారాన్ని బీట్ బజార్‌లోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో రైతుబజార్ కోసం మున్సిపల్ నుంచి 32 గుంటల స్థలం తీసుకున్న నేపథ్యంలో, దరూర్ క్యాంప్ ప్రాంతంలో మున్సిపాలిటీకి కేటాయిస్తామని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపిన 5 ఎకరాల స్థలాన్ని ఇప్పటికైనా కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. శిధిలమైన క్వార్టర్లను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టి, సాధ్యమైన చోట వాటిని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగంలోకి తీసుకురావాలని కౌన్సిలర్ అరవ లక్ష్మి, ఎసిఎస్ రాజు జిల్లా కలెక్టర్‌ను కోరారు.

## టీపీఆర్టీయూ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా రొట్టె శ్రీనివాస్

### -నూతన పదవి బాధ్యతలు చేపట్టిన రొట్టె శ్రీనివాస్





**ధర్మపురి, సెప్టెంబర్ 21 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లాలోని బుగ్గారం మండలం లోని చిన్నాపూర్ గ్రామంలో గల స్థానిక మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల యందు స్కూల్ అసిస్టెంట్ హిందీ పండితుడిగా విధులు నిర్వహిస్తున్న రొట్టె శ్రీనివాస్ తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్ష వర్ధన్ రెడ్డి చేతుల మీదుగా సంఘ సభ్యత్వంను స్వీకరించిన తధానంతరం జగిత్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా రొట్టె శ్రీనివాస్ ను నియమించారు. ఆదివారం రోజు సాయంత్రం వేళలో ధర్మపురి పట్టణ కేంద్రంలో జరిగిన ముఖ్య సమావేశం నందు కార్యక్రమాన్ని ఉద్దేశించి గాల్ రెడ్డి హర్ష వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు సంబందించిన పెండింగ్ డిఏ లను వెంటనే చెల్లించి పీఆర్సీని వెంటనే అమలు చేయాలి అని కార్యక్రమాన్ని ఉద్దేశించి తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. సోమవారం రోజు పలువురు రోట్టే శ్రీనివాస్ చేపట్టిన పదవి బాధ్యతల పట్ల తమ హర్షం వ్యక్తం చేస్తూ ముమ్మందు మరెన్నో పదవి బాధ్యతలు చేపట్టి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పట్ల కృషి చేయాలి అని వారు కోరారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, టీపీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడు, చంద్ర శేఖర్ రావు, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నరుకుల్ల శ్రీధర్ లతో పాటు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబందించిన నాయకులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ నాయకులు, తదితరులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కెన్యాలో ఘనంగా గణనాథుడి సెలబ్రేషన్స్

### ముగిసిన గణేశ్ ఉత్సవాలు

### పడవల్లో వెళ్ళి హిందూ మహాసముద్రంలో గణేషుడి నిమజ్జనం...





**సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 (ప్రజా మంటలు):** కెన్యా దేశంలోని మొంబాసా నగరంలో మొంబాసా తెలుగు అసోసియేషన్ (ఎంఓఎంటీఏ) ఆధ్వర్యంలో వారం రోజులుగా అంగరంగ వైభవంగా జరిగిన వినాయక చవితి వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పాటు సాయంత్రం వేళల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో భజన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు మహాప్రసాద వితరణ, అన్నదానం గావించారు. ఉత్సవాల్లో భాగంగా మహిళలు, చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. సుదూర ప్రాంతాల్లో ఉంటున్న ప్రవాస భారతీయులు కుటుంబ సమేతంగా తరలివచ్చి లంబోదరుడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా గణనాథుడిని పడవల్లో తరలించి హిందూ మహాసముద్రంలో శాస్త్రోక్తంగా నిమజ్జనం చేశారు. 'గణపతి బప్పా మోరియా' నామస్మరణలతో తీర ప్రాంతం మార్మోగింది. విదేశీ గడ్డపై భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన ఈ ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో దిగ్విజయంగా ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. ఏడాది పొడుగున వచ్చే ప్రతి తెలుగు పండుగను కెన్యా లోని మొంబాసా లో తాము ఐక్యంగా కలిసి సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలుగు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

## టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా రొట్టె శ్రీనివాస్



**ధర్మపురి/బుగ్గారం, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 21 :** జగిత్యాల జిల్లాలోని బుగ్గారం మండలం లోని చిన్నాపూర్ గ్రామంలో గల స్థానిక మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల యందు స్కూల్ అసిస్టెంట్ హిందీ పండితుడిగా విధులు నిర్వహిస్తున్న రొట్టె శ్రీనివాస్ తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్ష వర్ధన్ రెడ్డి చేతుల మీదుగా సంఘ సభ్యత్వంను స్వీకరించారు. తధనంతరం జగిత్యాల జిల్లా నూతన అధ్యక్షుడిగా రొట్టె శ్రీనివాస్ ను నియమించారు. ఆదివారం సాయంత్రం వేళలో ధర్మపురి పట్టణ కేంద్రంలో జరిగిన ముఖ్య సమావేశం నందు కార్యక్రమాన్ని ఉద్దేశించి గాల్ రెడ్డి హర్ష వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు సంబందించిన పెండింగ్ డిఏ లను వెంటనే చెల్లించి పీఆర్సీని వెంటనే అమలు చేయాలి అని కార్యక్రమాన్ని ఉద్దేశించి తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. సోమవారం రోజు పలువురు రోట్టే శ్రీనివాస్ చేపట్టిన పదవి బాధ్యతల పట్ల తమ హర్షం వ్యక్తం చేస్తూ ముమ్మందు మరెన్నో పదవి బాధ్యతలు చేపట్టి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పట్ల కృషి చేయాలి అని వారు కోరారు. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు, టీపీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడు పాతూరి రాజిరెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడు, చంద్ర శేఖర్ రావు, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నరుకుల్ల శ్రీధర్ లతో పాటు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబందించిన నాయకులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘ నాయకులు, తదితరులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్తంభంపల్లి గ్రామం లో హార్వెస్టింగ్ పాండ్ పనులు ప్రారంభం



**వెల్గటూర్ సెప్టెంబర్ 21 ( ప్రజా మంటలు ):** వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామం లో సోమవారం రోజున పథకం లో భాగంగా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా వాటర్ హార్వేస్టింగ్ పాండ్ పనులనీ గ్రామ సర్పంచ్ భూపల్లి రాజయ్య, ఉపసర్పంచ్ యాగండ్ల గంగయ్య గార్ల చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ పాండ్ ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు గ్రామంలోని నీటి వనరులని సంరక్షించడానికి ఉపయోగపడుతుంది. పశువులు, పక్షుల కీ దాహం తీర్చడం జరుగుతుంది. ఈ కార్యక్రమం లో సర్పంచ్ భూపల్లి రాజయ్య, ఉపసర్పంచ్ యాగండ్ల గంగయ్య, పంచాయతీ కార్యదర్శి కుమార్ స్వామి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ జక్కుల రాజేందర్, మరియు ఉపాధి హామీ సిబ్బంది పాలొగొన్నారు.

## ప్రగతిశీల కార్యచరణ కమిటీ పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ విరాళం



**గొల్లపల్లి సెప్టెంబర్ 21 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండలంలోని ఇస్రాజిపల్లి గ్రాములో ప్రగతిశీల కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలోని పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా అందజేశారు. పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని తెలుసుకున్న కమిటీ సభ్యులు, విద్యార్థుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఇస్రాజిపల్లి ప్రగతిశీల కార్యాచరణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, విద్య, వైద్యం, క్రీడలు, గ్రామాభివృద్ధి, సేవా కార్యక్రమాలను ప్రధానంగా తీసుకుని, ప్రజలకు అవసరమైన సందర్భాల్లో తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగానే పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని తెలుసుకుని, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఇతర ప్రజా అవసరాలకు సంబంధించిన సమస్యలు తమ దృష్టికి వచ్చినప్పుడు, వాటి పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తూ, ముందుండి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## వీరా - నాని యూత్ వినాయకుడిని దర్శించుకున్న మంత్రి అడ్లూరి





**వెల్గటూర్ సెప్టెంబర్ 21 ( ప్రజా మంటలు ) :** వెల్గటూర్‌లో వీరా నాని యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు పాల్గొని, విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం, మంత్రి అడ్లూరి గారితో పాటు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలెందర్ రెడ్డి గారిని ఉత్సవ కమిటీ నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## కళాసిగూడ గణనాథుడి సేవలో మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 21(ప్రజా మంటలు):** రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని కళాసిగూడలో స్థానిక యువకులు ప్రతిష్టించిన వినాయక మండపంలో మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపం వద్దకు చేరుకున్న ఆయనకు నిర్వాహకులు, స్థానిక నాయకులు సాదరంగా స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ గణనాథుడికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు, యువజన సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవీనగర్‌లో వినాయకుడికి 118 రకాల నైవేద్యాలు..

### -వైభవంగా ప్రత్యేక పూజలు



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 21 ( ప్రజా మంటలు):** బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని దేవీనగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్థానిక భక్తులు విఘ్నేశ్వరుడికి ఏకంగా 118 రకాల విభిన్న వంటకాలతో కూడిన మహా నైవేద్యాన్ని సమర్పించి తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. మండపం వద్ద వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ దేవీనగర్ కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గణపతికి శాస్త్రోక్తంగా అర్చనలు, హారతులు సమర్పించారు. కాలనీలోని ప్రతి ఇల్లూ భాగస్వామ్యమై వివిధ రకాల పిండివంటలు, పండ్లు, ప్రసాదాలను ప్రత్యేకంగా తయారు చేసి స్వామివారికి నివేదించడం విశేషంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, యువకులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## గాంధీ మాతా శిశు ఆస్పత్రి వద్ద రోగుల సహాయకుల నరకయాతన

### -కనీస సౌకర్యాల్లేక రోడ్డుపైనే పడిగాపులు







**సికింద్రాబాద్, సెప్టెంబర్ 21(ప్రజా మంటలు):** ప్రముఖ ప్రభుత్వ వైద్య కేంద్రమైన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలోని మాతా శిశు సంరక్షణ విభాగం (ఎంసీహెచ్) వద్ద రోగుల సహాయకులు, బంధువుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. నిత్యం వేలాది మంది గర్భిణులు, బాలింతలు, చిన్నారుల చికిత్స కోసం ఇక్కడికి తరలివస్తుండగా, వారితో పాటు వచ్చే సహాయకులకు తలదాచుకునేందుకు కనీస నీడ కూడా కరువైంది. సరైన వసతులు లేకపోవడంతో తీవ్ర ఎండ, అకాల వర్షాలకు తడుస్తూ భవనం ఆవరణలోని రోడ్లపైనే, నేలపై కూర్చొని వారు కాలం గడపాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు చిన్నపిల్లలను ఒళ్లో పెట్టుకుని గంటల తరబడి నేలపైనే వేచి చూస్తూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రతిరోజూ నగరంతో పాటు వివిధ జిల్లాల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు ఈ ఆసుపత్రికి వస్తుండటంతో ఇక్కడ ఎప్పుడూ తీవ్ర రద్దీ నెలకొంటుంది. ఓపి విభాగం ఎంసిహెచ్ భవనం లోపల ఉండటంతో జనాలు పెద్ద సంఖ్యలో లోపలకి వెళుతుండటం వారిని నియంత్రణ చేయడం సెక్యూరిటీ సిబ్బందికి తలనొప్పిగా మారింది. గైనిక్ ఓపి ఎంసిహెచ్ భవనం లోపల కాకుండా బయట ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న చోట కనీస మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని రోగుల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సహాయకులు కూర్చునేందుకు అవసరమైన కుర్చీలతో కూడిన షెడ్లు, మంచినీటి వసతి, ప్రత్యేక వాష్‌రూమ్ కాంప్లెక్స్‌లు, వాహనాల పార్కింగ్ షెడ్లను వెంటనే నిర్మించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఓపి విభాగం బిల్డింగ్ నుంచి ఎంసీహెచ్ భవనంలోకి వెళ్లేందుకు నిర్మించిన స్కై వే నిరుపయోగంగా ఉందని, దానిని ఉపయోగం లోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వైద్యశాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎంసీహెచ్ వద్ద ఎదురవుతున్న ఈ సమస్యలను పరిష్కరించి, అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని రోగులు, వారి బంధువులు వేడుకుంటున్నారు.

## సిలబస్ మార్పుపై టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. అభ్యర్థులకు ఊరట

- పోటీ పరీక్షల సిలబస్‌పై వస్తున్న వదంతలకు టీజీపీఎస్సీ తెర
- ప్రస్తుతానికి ఎలాంటి సిలబస్ కమిటీని ఏర్పాటు చేయలేదని వెల్లడి
- పెద్ద మార్పులు ఉంటే ఏడాది ముందుగానే సమాచారం ఇస్తామని హామీ
- చిన్నపాటి మార్పులను నోటిఫికేషన్‌లోనే తెలియజేస్తామని ప్రకటన

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కీలక స్పష్టతనిచ్చింది. పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు చేస్తారంటూ గత కొద్ది రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వదంతులకు కమిషన్ తెరదించింది. సిలబస్ మార్పుపై అభ్యర్థుల నెలకొన్న ఆందోళనలు, వారి నుంచి వెల్లువెత్తుతున్న వినతుల నేపథ్యంలో టీజీపీఎస్సీ ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. సిలబస్ సమీక్ష కోసం ప్రస్తుతానికి ఎలాంటి కమిటీని ఏర్పాటు చేయలేదని టీజీపీఎస్సీ కార్యదర్శి స్పష్టం చేశారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల సిలబస్‌లో ఏవైనా భారీ మార్పులు చేపట్టాల్సి వస్తే, ఆ విషయాన్ని కనీసం ఏడాది ముందే అభ్యర్థులకు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. తద్వారా అభ్యర్థులు మారిన సిలబస్‌కు అనుగుణంగా సిద్ధమవడానికి తగిన సమయం లభిస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా, ఏవైనా స్వల్ప మార్పులు లేదా చేర్పులు అవసరమైతే, ఆ వివరాలను సంబంధిత ఉద్యోగ నియామక నోటిఫికేషన్‌తో పాటే వెల్లడిస్తామని వివరించారు. సిలబస్ మార్పుపై అభ్యర్థులు అనవసరంగా ఆందోళన చెందవద్దని, అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా సూచించారు. కమిషన్ ఇచ్చిన ఈ స్పష్టతతో లక్షలాది మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఊరట లభించినట్లయింది.

## బేగంపేటలో భారీ చోరీ.. 81 తులాల బంగారం, నగదు అపహరణ

- 81 తులాల బంగారం, రూ.14.75 లక్షల నగదు అపహరణ
- ఇంట్లో పనిచేసే సిబ్బందిపైనే అనుమానం
- ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు



హైదరాబాద్‌లోని బేగంపేటలో భారీ చోరీ చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉమానగర్‌లో నివసిస్తున్న శ్రీనాథ్ నాయుడు అనే వ్యక్తి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. ఇంట్లో భద్రపరిచిన 81 తులాల బంగారం, రూ. 14.75 లక్షల నగదు కనిపించ కపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే, శ్రీనాథ్ నాయుడు కుటుంబ సభ్యులు తమ ఇంట్లోని అల్మారాలో దాచిన నగదు, నగలు మాయమైనట్లు ఆలస్యంగా గుర్తించారు. వెంటనే పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. తమ ఇంట్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను పోలీసులకు అందజేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీనాథ్ నాయుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ చోరీకి పాల్పడింది వారేనా లేక ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

ప్రజా మంటలు

మంగళవారం 22 - 09 - 2026

# స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు శుభవార్త

**6 ఏళ్లు పూర్తయితే అడ్వాన్స్‌మెంట్ స్కీమ్**

రాష్ట్రంలోని స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆరేళ్లు సర్వీస్ పూర్తి చేసిన వారికి ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలుకు ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలో స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆరేళ్లు సర్వీస్ పూర్తి చేసిన వారికి ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ అమలునకు ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చింది. ఆరేళ్లు అదే పోస్టులో అదే క్యాడర్లో పనిచేస్తే వారికి ప్రత్యేక గ్రేడ్ పోస్ట్ స్కేల్ ఇస్తూ ప్రభుత్వ ఆదేశాలు జారీ అయ్యాయి. 11వ పీఆర్సీలో ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీం విధివిధానాలు దీనికి వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.రాష్ట్రంలో 15,004 స్వర్ణ, వార్డు గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 1,35,000 మంది వివిధ స్థాయిల్లో పనిచేస్తున్నారు. వార్డు కార్యదర్శి శానిటేషన్ కార్యదర్శి సంక్షేమం అలాగే ఇతర హోదాల్లో పనిచేస్తున్న వాళ్లూ ఉన్నారు. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 11,500 పైగా సచివాలయాలు ఉంటే, పట్టణ ప్రాంతంలో మిగిలినవి ఉన్నాయి.అర్హులైన వారందరికీ అడ్వాన్స్మెంట్ స్కీము : 2019, 2020లలో నియమితులైన వారందరికీ ఈ స్కీము వర్తిస్తుందనీ ప్రభుత్వం ఉత్తర్వుల్లో వివరించింది. వీరందరూ గత కొంతకాలంగా తమకు అడ్వాన్స్మెంట్ స్కీమ్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి చర్చించిన సమయంలోనూ దీనిపైన స్పష్టమైన హామీ ఇచ్చారు. సీఎం ఆదేశాల మేరకు ఈ ఉద్యోగుల్లో అర్హులైన వారందరికీ ఈ అడ్వాన్స్మెంట్ స్కీము వర్తిస్తుంది. ఈ మేరకు ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాల్లో వివరించింది. ఈ మేరకు స్వర్ణ, వార్డు గ్రామ విభాగం ప్రభుత్వ కార్యదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు ఇచ్చారు.ఐదు కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటు : మరోవైపు రాష్ట్రంలో ఐదు కొత్త గ్రామపంచాయతీలు ఏర్పాటయ్యాయి. ప్రకాశం జిల్లాలో మూడు, బాపట్ల జిల్లాలో రెండు కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు ఇచ్చారు. ప్రకాశం జిల్లా వేటపాలెం మండలం లక్ష్మీపురం, కొణిజేటి చేనేతపురి, వైఎస్సార్ గ్రామపంచాయతీలను ఏర్పాటు చేశారు. వీటిని అక్కడ ఉన్న ఐదు గ్రామపంచాయతీల నుంచి కొన్ని గ్రామాలను చేర్చడం ద్వారా రూపకల్పన చేశామని ఉత్తర్వుల్లో చెప్పారు.బాపట్ల జిల్లా చీరాల మండలంలో బోయినవారిపాలెం సాయి కాలనీ గ్రామపంచాయతీలను కొత్తగా ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న ఓడరేవు, బూర్లవానిపాలెం, ఇరుపు పాలెం పంచాయితీలను పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

# బాలాపూర్ లడ్డూ ఎందుకంత ఫేమస్ వేలంలో వచ్చిన డబ్బును ఏం చేస్తార

హైదరాబాద్ లో ఖైరతాబాద్ వినాయకుడి తర్వాత అందరి దృష్టినీ ఆకర్షించేది బాలాపూర్ లడ్డూ. ఈ మహాప్రసాదాన్ని దక్కించుకునేందుకు ఏటా భక్తులు పోటీ పడుతుంటారు. బాలాపూర్ గణేశ్ లడ్డూ విశేషాలు, ఎప్పటి నుంచి ప్రారంభమైందనే వివరాలు తెలుసుకుందాం.గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో బాలాపూర్?కు ఓ ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ స్వామివారికి సమర్పించే లడ్డూ ప్రసాదానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రత్యేక గుర్తింపు ఉంది. తొమ్మిది రోజుల పాటు ధూపదీప నైవేద్యాలతో పూజలందుకునే స్వామివారి చేతిలోని 21 కేజీల లడ్డూ ప్రసాదం పొందడం వల్ల శుభప్రదం, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకే ఈ లడ్డూను దక్కించుకునేందుకు వేలంలో ఎంతో మంది పోటీ పడుతుంటారు. అసలు ఈ లడ్డూ వెనక ఉన్న చరిత్ర ఏంటి? ఎప్పటి నుంచి ప్రారంభమైంది? ఆ సొమ్ముతో ఏం చేస్తార అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

**1994 నుంచి లడ్డూ వేలం**

బాలాపూర్ గణేశుడికి 45 ఏళ్ల ఘన చరిత ఉంది. గణనాథుడిపై భక్తులకు ఉన్న అచంచల విశ్వాసాన్ని ఇనుమడింపజేయాలనే ఆలోచనతో తొలిసారిగా బాలాపూర్ ఉత్సవ సమితి 1994లో లడ్డూ వేలాన్ని నిర్వహించింది. మొదటిసారిగా కొలను మోహన్ ?రెడ్డి అనే రైతు ఈ లడ్డూను రూ.450లకు కైవసం చేసుకున్నారు. దాన్ని కుటుంబ సభ్యులు, బంధువులకు పంచిపెట్టి మిగతాది తన పొలాల్లో చల్లుకున్నారు. దాంతో సుఖసంతోషాలు కలిగాయనే నమ్మకంతో మరుసటి ఏడాదితో పాటు 1998, 2004, 2008లలోనూ ఆయన పోటీ పడి మరీ లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు.లడ్డూ వేలంలో పాల్గొనేందుకు 15 ఏళ్ల పాటు స్థానికులకే అవకాశం కల్పించిన బాలాపూర్ ఉత్సవ సమితి, ఆ తర్వాత కాలంలో బయట వ్యక్తులనూ అనుమతించింది. ఆ విధంగా 2009లో సరిత అనే మహిళ రూ.5.10 లక్షలకు దీనిని సొంతం చేసుకున్నారు. ఇప్పటి వరకు 31 సార్లు లడ్డూ వేలం నిర్వహించగా 2020లో కొవిడ్? పరిస్థితుల నేపథ్యంలో వేలం వేయకుండా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లడ్డూను అందజేశారు. 2024లో కొలను శంకర్ రెడ్డి రూ.30.1 లక్షలకు, గతేడాది లింగాల దశరథ్ గౌడ్ రూ.35 లక్షలకు ఈ లడ్డూను దక్కించుకున్నారు.

**ఆ డబ్బుతో ఏం చేస్తారంటే?**

లడ్డూ వేలం వేయగా వచ్చిన నగదు ఏం చేస్తారనే దానిపై చాలా మందికి సందేహముండటం సహజం. అయితే అలా వచ్చిన సొమ్ముతో బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అనేక అభివృద్ధి పనులను చేపడుతోంది. బాలాపూర్‌లోని హనుమాన్, వేణుగోపాల స్వామి, లక్ష్మీ గణపతి, శివాలయం, మల్లన్న మందిరం, పోచమ్మ, మహంకాళి, కంఠ మహేశ్వరం స్వామి ఆలయాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టింది. ఉన్నత పాఠశాలలో షెడ్డును ఏర్పాటు చేసింది. గణేశ్ మండపానికి స్థలాన్ని కొనుగోలు చేశారు. గణేశ్ చౌక్?ను ఏర్పాటు చేశారు. గ్రామంలో పలుచోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ విధంగా పలు కార్యక్రమాల నిమిత్తం ఇప్పటి వరకు



రూ.1,73,87,970 ఖర్చు చేసినట్లు బాలాపూర్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి వివరించారు.

**గతేడాది రూ.35 లక్షలు పలికిన బాలాపూర్ లడ్డూ**

ప్రసిద్ధ బాలాపూర్ లడ్డూను దక్కించుకునేందుకు ఏటా భక్తులు పోటీ పడుతుంటారు. ఏటేటా అంచనాలను పెంచుతూ దేశ విదేశాల్లో ఉన్న తెలుగు వారిని ఆకర్షించే ఈ వేలం పాట, ఈ ఏడాది కూడా జరగనుంది. 32 ఏళ్లుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్న గణేశ్ లడ్డూ వేలం పాటలో గతేడాది రూ.35 లక్షల రికార్డుస్థాయి ధర పలికింది. కర్మన్?ఘాట్?కు చెందిన లింగాల దశరథ్ ?గౌడ్ దీనిని దక్కించుకున్నారు. మరి ఈ సంవత్సరం ఎవరు దక్కించుకుంటారో తెలుసుకోవాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

# కారు డోర్ లాక్ ఊపిరాడక చిన్నారి మృతి

కారులో ఊపిరాడక చిన్నారి మృత్యువాత పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో ఈ విషాదఘటన చోటుచేసుకుంది. ముద్దు ముద్దు మాటలతో తల్లిదండ్రులను మురిపించిన చిన్నారి విగత జీవిగా మారడంతో అంతా కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం వినోబానగర్?లో కారులో ఊపిరాడక చిన్నారి మృతి చెందింది. వినోబానగర్ సర్పంచి గంగావత్ నవీన్?కు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తె తన్విశ్రీ (4) ఇంటి వద్ద ఆడుకుంటూ కారు ఎక్కింది. అనంతరం డోర్ వేయడంతో లాక్ పడింది. కుటుంబ సభ్యులు చిన్నారి కనిపించడం లేదని సమీపంలో వెతికారు. సుమారు రెండు గంటల తరువాత కారులో చూశారు. ముందు భాగంలోనే 2 సీట్ల మధ్యలో పడిపోయి ఉంది. కారు అద్దాలు పగలగొట్టి చిన్నారిని బయటకు తీశారు. అయితే అపస్మారక స్థితిలోకి వెళ్లిందని భావించారు. అనంతరం చికిత్స నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు బాలిక అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు. ఉదయం ముద్దు ముద్దు మాటలతో తల్లిదండ్రులను మురిపించిన చిన్నారి విగత జీవిగా మారడంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో వాహన యజమానిని అలర్ట్ చేసే సాంకేతికత ఒకటి అందుబాటులో ఉందని పోలీసులు చెబుతున్నారు.

**చైల్డ్ డిటెక్షన్ అలర్ట్**

కారు ఉన్న ప్రతివారూ ఈ "చైల్డ్ డిటెక్షన్ అలర్ట్"ను



ఉపయోగించడం మంచిది. కారులో పిల్లలు ఉంటే గనక ఈ పరికరం వెంటనే మొబైల్ ఫోన్‌కు నోటిఫికేషన్ పంపుతుంది. హెచ్చరిక ద్వారా యజమానిని అలర్ట్ చేస్తుంది. ఒకసారి మాత్రమే కాకుండా ప్రతి నిమిషానికీ ఈ నోటిఫికేషన్ వస్తూనే ఉంటుంది.ఇప్పుడు వస్తున్న కార్లలో చాలా వాటికి ఈ పరికరం ఇన్ బిల్ట్‌గా ఉంటోంది. లేని వాటికి, ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ పరికరానికి సంబంధించిన సెన్సార్‌ను కారు వెనుక బిగించాల్సి ఉంటుంది.కొన్ని పరికరాలు వాయిస్ అలర్ట్ కూడా ఇస్తాయి. ఇది మరింత ఉపయోగకరంగా ఉంటుంది. యజమాని స్పందించకపోతే అలర్ట్ తీవ్రతను పెంచుతూ మెసేజ్ పంపుతూ ఉంటాయి.

**రేర్ సీట్ రిమైండర్**

చైల్డ్ డిటెక్షన్ మాదిరిగానే మరో ఆప్షన్ కూడా అందుబాటులో ఉంది అదే "రేర్ సీట్ రిమైండర్". ఈ వ్యవస్థ, కారు పార్కింగ్ చేసిన అనంతరం వెనుక సీట్లో చిన్నారులు, ఇంకా పెట్స్ ఉన్నాయోమో చూసుకోవాలని రిమైండ్ చేస్తుంది.కారు డోర్ తెరిచేటప్పుడు, ఇంకా మూసేటప్పుడు ఇది పనిచేస్తుంది. కారు పార్కింగ్ చేయడం పూర్తయిన తర్వాత ఈ సిస్టమ్ డ్రైవర్ లేదా ఓనర్?కు వార్నింగ్ ఇస్తుంది."డోర్ సీక్వెన్సింగ్ టెక్నాలజీ" ప్రకారం ఇది పనిచేస్తుంది. మోడ్రన్ ఫీచర్స్‌లో భాగంగా ఈ ఆప్షన్?ను ఇన్ బిల్ట్‌గా కొన్ని కంపెనీలు దీన్ని అందిస్తున్నాయి.లాంటి పరికరాలు ఎంతో అవసరమని కార్లు, ఇతర వాహనాల్లో పిల్లలు, పెంపుడు జంతువులు ఉంటే వెంటనే అలర్ట్ చేస్తాయని పోలీసులు చెబుతున్నారు.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి**

కారు డోర్ లాక్ చేసేటప్పుడు తప్పకుండా అన్ని సీట్లనూ పరిశీలించాలి.

వాహనం కీస్ ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు అందుబాటులో ఉంచొద్దు.

కారు పార్కింగ్ తర్వాత కచ్చితంగా డోర్ లాక్ చేయాలి.

డోర్ గ్లాస్?కు బ్లాక్ ఫిల్మ్?, ఎక్కువ డెంటింగ్ ఉంచొద్దు. దీనివల్ల పిలల రూల్స్ కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి.

ఇక ఉపయోగించని వాహనాలైతే డోర్స్ క్లోజ్? చేసి తాళం వేసేయాలి.

ఇంట్లో పిల్లలు కనిపించకపోతే వెంటనే వాహనాలను తనిఖీ చేయాలి.

వాహనాల దగ్గర, లోపల ఆడుకోవడం మంచిది కాదని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి.

# ఇందిరమ్మ ఫ్లాట్ లబ్ధిదారులకు గుడ్‌న్యూస్ నేటి నుంచి అలాట్‌మెంట్ లెటర్స్

హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులకు నేటి నుంచి హౌజింగ్‌బోర్డు అలాట్‌మెంట్ లెటర్స్ జారీ చేయనుంది. ఈ మేరకు లబ్ధిదారుల మొబైళ్లకు నేరుగా పత్రాలను పంపనుంది. అధికారిక వెబ్‌సైట్ నుంచీ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రకటించింది. ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు శుభవార్త చెప్పింది. ఎంపికైన దరఖాస్తుదారులకు సోమవారం నుంచి అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు (టీజీహెచ్‌బీ) ప్రకటించింది. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా వాట్సప్, ఎంఎంఎం ద్వారా ఈ పత్రాలను పంపనున్నారు. అలాగే టీజీహెచ్‌బీ అధికారిక వెబ్‌సైట్ నుంచి కూడా వీటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

**రూ.50 లక్షల విలువ చేసే ఫ్లాట్ రూ.5 లక్షలకే**

మరోవైపు శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. మల్కం చెరువు వెనుక భాగంలో సుమారు రూ.750 కోట్లకుపైగా విలువైన 2.85 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇక్కడ మొత్తం 480 ఫ్లాట్లను నిర్మించనున్నారు. నాలెడ్జ్ సిటీ లాంటి ప్రధాన ప్రాంతంలో మార్కెట్లో దాదాపు రూ.50 లక్షలు విలువ చేసే ఒక్కో ఫ్లాట్‌ను కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం అందించనుంది. భూమి ఖర్చును పూర్తిగా భరిస్తున్న సర్కార్, ఒక్కో ఫ్లాట్‌కు రూ.5 లక్షల చొప్పున సబ్సిడీని అందిస్తోంది. కాగా నేడు మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి లబ్ధిదారులు కుటుంబ సమేతంగా హాజరుకావాలని హౌసింగ్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు.

**డబుల్ బెడ్‌రూం ఇళ్లపైనా కీలక ఆదేశాలు**

హైదరాబాద్ క్యూర్ పరిధిలోని అసంపూర్తిగా ఉన్న 26 ప్రాంతాల్లో 21 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ నెల చివరి నాటికి ఈ ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సచివాలయంలో శనివారం హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, గృహనిర్మాణ, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా నిర్వహించారు.

**వారికే ఇళ్లు కేటాయించాలి**



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపికను ఈ నెల 30వ తేదీలోపు అత్యవసర ప్రాతిపదికన లక్కీ డ్రా ద్వారా చేపట్టాలని మంత్రి పొంగులేటి అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాలకు 5 నుంచి 7 కిలోమీటర్ల పరిధిలో నివసిస్తున్న వారిని మాత్రమే ఎంపిక చేయాలని సూచించారు. ఈ ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జలమండలి, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), విద్యుత్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. అక్టోబర్ చివరి నాటికి మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తి కావాలని ఆదేశించారు."డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అనర్హులు ఉంటే అధికారులు వెంటనే వారిని తొలగించాలి. కేటాయించిన ఇళ్లలో నివసించని వారికి తుది నోటీసులు జారీ చేయాలి. స్పందించని వారి కేటాయింపులను రద్దు చేసి, ఆ యూనిట్లను అర్హులైన వారికి తిరిగి కేటాయించాలి. క్యూర్ పరిధిలో ఇప్పటికే ఇంటి స్థలాలు ఉన్న సుమారు 9 వేల మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాము. ఇన్‌ఛార్జ్ మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి మంజూరు పత్రాలను అందజేయాలి" గృహ, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

## బంగాళాఖాతంలో అల్పపీడనం ఏపీలో 4 రోజుల పాటు వర్షాలు



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని సూచించింది. ఉత్తర అండమాన్, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ వాయవ్య దిశగా కదిలి ఆదివారం ఉదయానికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైందని వాతావరణ శాఖ పేర్కొంది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ క్రమంగా బలపడి, ఇవాళ తూర్పు మధ్య బంగాళాఖాతంలోనే వాయుగుండంగా మారనుంది. మంగళవారానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడే అవకాశం ఉంది. బుధవారం ఉదయానికి పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలకు సమీపంలో పశ్చిమ మధ్య, దాన్ని ఆనుకొని ఉన్న వాయవ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉంది.ఈ ప్రభావంతో ఇవాళ, రేపు ఓ మోస్తరు వర్షాలు, బుధ, గురువారాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. కోస్తాంధ్ర తీరం వెంట 50 కిలోమీటర్ల నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీసే అవకాశం ఉంది. ఈరోజు అల్లూరి సీతారామరాజు, పోలవరం, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని వాతావరణశాఖ సూచించింది.

## ఏపీలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు.. ఆ ఇద్దరికీ కూడా పోస్టింగ్

**రాష్ట్రంలో 9 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం**

**సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా జయలక్ష్మికి నియామకం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఐజీగా కాంతి రాణాకు పోస్టింగ్ విశాల్ గున్నీకి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు**

**పల్నాడు, మార్కాపురం, పోలవరం జిల్లాలకు కొత్త ఎస్పీలు తక్షణమే బాధ్యతలు చేపట్టాలని ప్రభుత్వ ఆదేశాలు**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు 9 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో పలు కీలక విభాగాలతో పాటు, మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించారు.వివరాల్లోకి వెళితే, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా ఉన్న సి.హెచ్. త్రివిక్రమ్ వర్మను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ డైరెక్టర్‌గా నియమించారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్‌గా పనిచేస్తున్న జయలక్ష్మిని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా బదిలీ చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్ల ఐజీగా ఉన్న బి. రాజకుమారిని రైల్వేస్ ఐజీగా నియమిస్తూ, సీఐడీ మహిళా భద్రత విభాగం ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కొన్న ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ సస్పెండైన సంగతి తెలిసిందే. ఇటీవలే ప్రభుత్వం వీరిద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేసింది. దాంతో వారి పోస్టింగ్ కు మార్గం సుగమం అయింది. ఈ క్రమంలో ఈ ఇద్దరు అధికారులకు తాజా బదిలీల్లో పోస్టింగ్ ఇచ్చారు. కొంతకాలంగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కాంతి రాణాకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ ఐజీగా కీలక బాధ్యతలు ఇచ్చారు. అదేవిధంగా, పోస్టింగ్ కోసం వేచి ఉన్న మరో అధికారి విశాల్ గున్నీకి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు అప్పగించారు.

**గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్న బాబుజీ అట్టాడను టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీ చేశారు.**

జిల్లా స్థాయిల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పోలవరం ఓఎస్డీగా ఉన్న పంకజ్ కుమార్ మీనాను మార్కాపురం జిల్లా ఎస్పీగా నియమించారు. సీఐడీ ఎస్పీగా ఉన్న కె. చక్రవర్తిని పోలవరం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఇక సీఎం సెక్యూరిటీ గ్రూప్ (సీఎంఎస్‌జీ) ఎస్పీగా ఉన్న జగదీశ్ అడహళ్లికి పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పరిపాలనా సౌలభ్యం, శాఖల బలోపేతం లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

## 'శాప్ ముట్టడి'పై వైసీపీ వర్సెస్ పోలీసులు.. విజయవాడలో హై టెన్షన్

**డీఎస్సీ, స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలపై వైసీపీ ఆందోళన**

**విజయవాడలోని శాప్ కార్యాలయాన్ని ముట్టడించాలని పిలుపు**

**నిరసనకు అనుమతి లేదని స్పష్టం చేసిన పోలీసులు**

**చట్టాన్ని మీరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక**

**పలువురు వైసీపీ నేతలకు నోటీసులు**



విజయవాడలో అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డీఎస్సీ ఎంపిక ప్రక్రియ, స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళనకు పిలుపునిచ్చింది. విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) కార్యాలయాన్ని ముట్టడించాలని నిర్ణయించింది. అయితే, ఈ ఆందోళనకు ఎటువంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.డీఎస్సీ ఎంపికలో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా కింద అర్హులైన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని వైసీపీ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై వెంటనే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తోంది. ఇందులో భాగంగానే పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శాప్ కార్యాలయాన్ని ముట్టడించాలని పిలుపునిచ్చారు.వైసీపీ ముట్టడి పిలుపుపై పోలీసులు కఠినంగా స్పందించారు. నగరంలో వినాయక నిమజ్జన ఊరేగింపులు జరుగుతున్న నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా, ఎటువంటి ర్యాలీలకు గానీ, ధర్నాలకు గానీ అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తీసుకోలేదని తెలిపారు. అనుమతి లేని నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నా, ఇతరులను ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ వైసీపీ నేతలకు నోటీసులు జారీ చేస్తున్నారు.ఇప్పటికే పెనమలూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తికి పోలీసులు నోటీసులు అందజేశారు. ఒకవైపు వైసీపీ ఆందోళనకు సిద్ధమవుతుండగా, మరోవైపు పోలీసులు వారిని నిలువరించేందుకు ప్రయత్నిస్తుండటంతో విజయవాడలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com